# అందానికి అందం

కాకాని కమల



**ఉదయం** పది గంటలుకావస్తోంది.

మూర్తి ఆఫీసుకి వెళ్ళే హడావిడిలో ఉన్నాడు.

సీత ముందు గదిలో బల్లమీద భర్తకి భోజనం వడ్డించి తిరిగి వంటగదిలోకి వచ్చింది. అలా వచ్చి పట్టుమని పది నిముషాలు గడవకముందే "ధన్..." మంటూ శబ్దం కావటంతో మజ్జిగలో పోపు వేస్తున్న సీత త్రుళ్ళిపడి చేతిలో గరిట జారవిడిచి గభాల్న ముందు గదిలోకి వచ్చింది.

"ఛీ...ఛీ...ఈ వెధవ కొంపలో శాంతి సుఖం లేదు. కడుపునిండా తిండి తినే యోగ్యతకూడా లేదు." మూర్తి తింటున్న అన్నం పళ్ళెం విస్సురుగా తోసేసి, కోపంతో డైనింగ్ టేబిల్ ముందునుంచి లేచాడు.

అతడు తోసేసిన నిండు భోజనం కంచం టేబిల్ అంచులనుంచి జారి "ధన్..." మంటూ నేలమీద పడిపోయింది.

కంచంలో వడ్డించిన వేడి వేడి అన్నం, కూర, పప్పు...ఇల్లంతా విరజిమ్మినట్లు చిందరవందరగా పరుచుకున్నాయి.

గడపలో నిల్చున్న సీత స్థంభీభూతురాలు అయ్యింది ఆ దృశ్యాన్ని చూస్తూ. బిక్కచచ్చినట్లు గోడకు అతుక్కుని, తడారిపోతున్న గొంతుకతో భయంగా అంది: "ఇ...ఇప్పుడు...ఆ కూ...ర...కే మయ్యిందని? బాగానే ...వండాను కదా?"

అంతే!

ఆమె నోటి మాట పూర్తి కానేలేదు. "ఛట్...నోర్ముయ్..." అంటూ సింహంలా గద్దిస్తూ సింక్ దగ్గర్నుంచి దూకుడుగా వచ్చి, భార్య చెంపమీద ఛెళ్ళు మనిపించాడు మూర్తి.

మరుక్షణం అతని చేతి అయిదు వేళ్ళు సీత నల్లని చెక్కిలిమీద బుసబుసా పొంగి ఎర్రగా తట్టు తేలాయి.

కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరుగుతుంటే భయంతో గోడకి అంటుకుపోయి, దుఃఖం పైకి రాకుండా పయిటచెంగు నోటికి అడ్డం పెట్టుకుంది సీత.

మూర్తి భార్య మొఖంలోకి గుచ్చి చూస్తూ ఉరిమినట్లు కఠినంగా అన్నాడు:"ఏమే...కట్టుకున్న భర్తకి కడుపునిండా రుచిగా తిండి పెట్టటంకూడా చాతకాదూ? మరి ఇంకెందుకే నీ బ్రతుకు? నల్లగా కోతిలా ఉన్నా, జాలిపడి కానీ కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాను. కనీస కృతజ్ఞత లేదు సరికదా; భర్త నన్న కనీస గౌరవం లేకుండా మాటకి మాట ఎదురు జవాబులు చెప్పటం మాత్రం బాగా నేర్చుకున్నావ్! ఏం చూసుకునే ఆ మిడిసిపాటు? కోతిలాంటి నీ రూపాన్ని చూసుకొనా, లేక మీ పుట్టినింటి ఐశ్వర్యాన్ని చూసుకొనా?" మూర్తి భార్యమీద ధుమ ధుమలాడుతూ చేతులు కడుక్కొని, గబగబా కాళ్ళకి షూ లేసులు బిగించుకుని ధనాలున వీధి తలుపులు తెరుచుకుని బయటికి వెళ్ళిపొయ్యాడు.

భర్త మాటలు సీత మెత్తని మనసుని ముల్లులా గుచ్చుకొన్నాయి. అంతవరకూ నొక్కి పట్టిన కన్నీటిని ఇంక ఆపుకోలేక దుఃఖోద్వేగంతో మంచంపై వాలిపోయింది సీత.

చెక్కిలిమీద తగిలిన చెంపదెబ్బ కంటే మనసుకి తగిలిన మాటల దెబ్బే ఆమెని ఎక్కువగా బాధిస్తుంది. ఎంత వద్దు అనుకున్నా ...ధారగా జారుతున్న కన్నీటిలోనుంచి బాధగా గతం వెలికి రాసాగింది.

×× ×× ××

సీతకి విష్ణుమూర్తితో పెళ్ళయి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తోంది.

మూర్తి తెల్లగా, ఎత్తుగా మంచి అందంతో ఉంటాడు. నెలకి వెయ్యి రూపాయలు సంపాదన ఉన్న గవర్నమెంటు ఉద్యోగి.

అయితే అతనికి నా అన్నవాళ్ళు ఎవరూ లేరనే చెప్పాలి. ఒకవిధంగా అనాధగా పుట్టి, అనాధగానే పెరిగాడు. కొందరు సహృదయుల దయాధర్మాలమీద చదువుకుని

ఉన్నత విద్యావంతుడై, దైవఘటనగా మంచి ఉద్యోగరీకూడా సంపాదించుకున్నాడు. అతడికి అలా సహాయపడి చేయూత నిచ్చినవాళ్ళలో చలపతిరావు మస్టారు చాలా ముఖ్యులు.

మూర్తి కాలేజి ఫీజులకి డబ్బు కలెక్టు చెయ్యటం, అతనికి పెద్దల ఇళ్ళల్లో వారాలు కుదర్చటం వగైరా ఎన్నో బాధ్యతలు చలపతిరావు మస్టారు నిర్వహించేవారు.

నిస్సహాయతతో మానసికంగా కుంగిపోతున్న అతణ్ణి ఆరోగ్యవంతుణ్ణి చేసి మనిషిగా నిలబెట్టిన ఘనత నిస్సందేహంగా చలపతిరావు మస్టారిదే! వాళ్ళిద్దరి మధ్య ఉన్నది గురు-శిష్య సంబంధమే అయినా, ఒక తండ్రి కొడుక్కి ఎంత చెయ్యగలడో అంతా మూర్తికోసం శ్రమపడ్డారు చలపతిరావుగారు.

ఆరోజుల్లో మూర్తిలో ఎన్నో ఆదర్శాలు, మరెంతో ఆవేశం ఉండేవి.

సీత చలపతిరావు మస్టారుగారి ఒక్కగానొక్క బిడ్డ.

సీత పుట్టిన నాలుగేళ్ళకే భార్య చనిపోతే, ఆడామగా తనే అయి చలపతిరావుగారు కూతుర్ని కళ్ళల్లో ఒత్తులు వేసుకుని పెంచి పెద్ద చేశాడు.


సీత కాటుకలా చాలా నల్లగా ఉంటుంది. కాని, ఆ అమ్మాయి గుండ్రని మొహంలో, విశాలమైన ఆమె కోల కళ్ళల్లో చాలా కళ ఉంది. ఒంకీలు ఒంకీలు తిరిగిన ఆమె పొడవైన నల్లని జడ పెట్టని ఆభరణం. దీనికి తగినట్లు ఆమె వ్యక్తిత్వంకూడా ఎంతో ఉన్నతమైనది.

కాని, ఎన్ని ఉండి ఏమి ప్రయోజనం?

చూడగానే కనిపించేది మాత్రం కాకిలాంటి ఆమె ఒంటి నలుపేగాని, తియ్యని ఆమె మనసు కాదు కదా? దీనికితోడు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అందుకే సీత పెళ్ళి ఒక పెద్ద సమస్య అయ్యింది చలపతిరావుగారికి. సీతకి యుక్తవయస్సు వచ్చింది. ఇంటర్మీడియట్ పాసయి బి. ఎ. ప్రైవేటుగా చదువుతూంది. కూతురి పెళ్ళి సంబంధాల వేటలో కాళ్ళకి బలపాలు కట్టుకుని తిరగసాగడు చలపతిరావుగారు. సీత నలుపు అని, తగిన కట్న కానుకలు లేవని ఎన్నో సంబంధాలు వచ్చినవి వచ్చినట్టే వెనక్కి తిరిగిపోతున్నాయి. గత రెండు సంవత్సరాలుగా ఆయన సీత పెళ్ళి విషయంలో చేస్తున్న ప్రయత్నాలన్ని విఫలం అయిపోతున్నాయి. అయినా, ఆయన నిరుత్సాహపడలేదు. ఉన్నంతలో తన ఒక్కగానొక్క బిడ్డ సుఖశాంతులతో చల్లగా బ్రతకాలన్నదే తండ్రిగా ఆయన ఆరాటం, ఆశ!

చలపతిరావుగారి పేర్న చిన్న పెంకుటిల్లు ఉంది. ఊళ్ళో కొంచెం అప్పుకూడా ఉంది. అయితే, ఆ ఇల్లు అమ్మి అప్పు తీర్చి, మిగతా డబ్బుతో సీతని ఒక అయ్య చేతిలో పెట్టాలన్నదే ఆయన తాపత్రయం. పగలూ, రాత్రి అదే ఆలోచన. కాని, తా నొకటి తలిస్తే దైవం ఒకటి తలుచు నన్నట్లు విధి బలీయమై సరిగ్గా ఈ పరిస్థితిలోనే చలపతిరావు మస్టారు హఠాత్తుగా జబ్బుపడి మంచం పట్టారు. ఆయనకి బి. పి. పెరిగి విపరీతంగా గుండెపోటు వచ్చింది. రెప్పపాటులో విధి ఆయన్ని కర్కశంగా మృత్యుగహ్వారంలోకి విసిరివేసింది. ఆ సమయంలో మూర్తి






ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉన్నాడు. అయినా, వార్త తెలిసిన వెంటనే రెక్కలు కట్టుకుని గురువుగారి సన్నిధిని వ్రాలాడు. దగ్గరుండి శుశ్రూషలు చేశాడు.

ఒకప్రక్క మృత్యువుతో పోరాడుతూ, మరొక ప్రక్క కూతురు భవిష్యత్తు గురించి ఆ తండ్రి పడుతున్న మనోవేదన్ని చూసి తల్లడిల్లిపోయ్యాడు. అతని మనసు ద్రవించిపోయింది.

'ఆయన చల్లని దీవెన చేయూతతోనే కదా తను ఈరోజు ఇంతవాడు అయ్యాడు. ఆయన ప్రోత్సహామే లేకుంటే తను ఈపాటికి దారం తెగిన గాలిపటంలా ఏ ముళ్ళకంచెకి ఇరుక్కునేవాడో. ఏ రాయిరప్పని కొట్టుకునేవాడో కదా' అనుకుంటూ మూర్తి హృదయమంతా గురువుగారిపట్ల కృతజ్ఞతతో, ప్రేమతో నిండిపోయింది. తన రక్తంతో ఆయన పాదాలు కడిగినా తీరిపోనిది ఆయన ఋణం.

అందుకే చెప్పాడు: "మాస్టారూ! మీరు నాకు కేవలం గురువే కాదు; దైవ సమానులు. నా కోసం, నా చదువుకోసం, ఆఖరికి నా ఉద్యోగంకోసం మీ రెంతో చేశారు. సీత గురించి మీరేం దిగులు పడకండి. నిశ్చింతగా ఉండండి. సీతని నేను పెళ్ళి చేసుకుంటాను. నిజం...నిజం, మాస్టారూ!" మూర్తి ఆవేశంగా ఆయన రెండు చేతులూ పట్టుకున్నాడు.

గురువుగారిపట్ల గల భక్తి శ్రద్ధలకి మూర్తి కళ్ళనుంచి రాలిన కన్నీరు చల్లగా మాస్టారి దోసిలి తడిపింది.

మాస్టారు రెండు నిముషాల సేపు విస్మయంతో అలాగే మూర్తి ముఖంలోకి చూస్తూ ఉండిపొయ్యారు. తరువాత తల తిప్పి వంటగది గడపలో కన్నీటితో కుమిలిపోతూ కూర్చున్న సీతకేసి కూడా అలాగే రెండు నిముషాల సేపు చూసి నిట్టూర్చాడు.

ఇద్దరికి మధ్య పున్నమికి-అమావశ్యకి ఉన్నంత తేడా ఉంది.

అందాల చందమామ మూర్తి అయితే, అమావశ్య రాత్రి సీత!

కన్న కూతురిపట్ల ఎంత ప్రేమ ఉన్నా మూర్తికి అన్యాయం జరుగుతుందేమో అన్న వేదనతో ఆ వృద్ధుడి మనసు మూలిగింది.

నూతిలోంచి వచ్చినట్లున్న స్వరంతో పేలవంగా అన్నాడు చలపతిరావు మాస్టారు:. "మూర్తీ! మా సీతని పెళ్ళి చేసుకుంటావా?"

"అవును, మాస్టారూ..."

"కృతజ్ఞతతో అంటున్నావు కదూ ఈ మాట?"

మూర్తి ఖంగుతిన్నాడు. తల అడ్డంగా తిప్పుతూ అన్నాడు-"కాదు... కాదు, మాస్టారూ! కేవలం కృతజ్ఞతతో అయితే డబ్బిచ్చి సీతకి మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తానని వుండేవాడిని కదా? కాని, ఈ మాట నా మనసులోంచి వచ్చింది. ప్రేమ, అనురాగం అంటే ఏమిటో నేను మీ ఇంటికి వచ్చిన తరువాతే తెలుసుకున్నాను. మాస్టారూ! మీ సీత సమక్షంలో నా మనసు ఎన్నోసార్లు ఆర్ద్రం అయ్యింది. సీత మనిషి నలుపు కాని, ఆ అమ్మాయి మనసు ఎంతో అందమయినది. నిజం, మాస్టారూ! ఐ లవ్ హర్ ...ఎస్! ఐ లవ్ హర్..."

మాస్టారి కళ్ళల్లో కోటి దీపాలు ఒక్కసారి గప్పున వెలిగి, ఆరాయి.

సముద్రం పొంగినట్లు ఆయన హృదయంలో సంతోషం ఉప్పొంగింది.

ఆప్యాయతతో మూర్తిని రెండు చేతులూ సాచి గుండెకి హత్తుకున్నాడు.

అంత దుఃఖంలోనూ గడపలో కూర్చున్న సీత హృదయంలో క్షణకాలం ఆనందం నిశ్శబ్దంగా తాండవమాడింది. గుండెలో కోయిలలు కూశాయి.

విష్ణుమూర్తిలాంటి అందమైన యువకుడూ, కష్టం సుఖం తెల్సిన మనిషి తనకి భర్త కాబోతున్నాడు కదా అని ఎంతో సంబరపడింది.

మృత్యుముఖంలో ఉన్న తండ్రి కళ్ళల్లో కనిపించిన సంతోషం చూసి తృప్తి పడింది.

మూర్తి అన్న మాట ప్రకారం వారం రోజులు తిరక్కుండా గుళ్ళో పదిమంది పెద్దల ఎదుట అతి నిరాడంబరంగా సీత మెళ్ళో తాళి కట్టాడు.

చలపతిరావుగారి దేహంలోంచి ఏనాడో ప్రాణం లేచిపోయినా, కేవలం కూతురిమీద మమకారంతోనే ఇన్నాళ్ళు ఆ జీవుడు కొట్టుకుంది.

కాని, కూతుర్ని పసుపుబట్టలతో చూడగానే ఆయనలోని హంస లేచిపోయింది.

సీత, మూర్తిల పెళ్ళయిన పదహారు రోజుల పండగ వెళ్ళకుండానే చలపతిరావుగారికి అంత్యక్రియలు జరిపాడు మూర్తి.

అంతే!

అక్కడితో ఆ ఊరితో ఋణం తీరిపోయింది సీతకి.

ఇల్లు అమ్మి ఊళ్ళో బాకీలు తీర్చివేశాడు మూర్తి.

ఆ తరువాత సీత భర్తతో హైదరాబాదుకి వచ్చేసింది.

బాకీలు తీర్చగా మిగిలిన డబ్బుతో సంసారానికి కావల్సినవి అమర్చుకుంది.

కొత్త సంసారం కొత్తకుండలో నీరులా తియ్యగా ఉంటుంది అంటారు...అంతగా కాకపోయినా.

దాదాపు ఒక సంవత్సరం సీత, మూర్తిల దాంపత్యం ఆనందంగానే గడిచింది.

అంతే!

ఆ తరువాత క్రమంగా మూర్తితో సీత బ్రతుకు నరకం అయిపోయింది. కన్నీటి భోజనం, కలతల కాపురం అయిపోయింది.

నల్లగా కాటుకలా ఉన్న సీతని తొందరపడి పెళ్ళి చేసుకున్నానన్న భావం అతనిలో రోజు రోజుకి ఎక్కువైపోయింది. ఆనాటి తన తొందరపాటుకి, అవివేకానికి ఇప్పుడు తీరుబడిగా విచారించటం మొదలు పెట్టాడు. అందమైన అమ్మాయిలు కనిపిస్తే మనసు ఈర్ష్యతో మూల్గేది. తనకి జరిగిన అన్యాయానికి మనసు ఆక్రోశపడేది.

అంతే! దాంతో భార్యని వేధించటం ఎక్కువయ్యింది. ఏ చిన్న వంక దొరికినా సీతని వ్రేలెత్తి చూపటం, ఇంట్లో ఏ కొంచెం ఇబ్బంది వచ్చినా భార్యని సాధించటం పనిగా పెట్టుకున్నాడు. అనుక్షణం ములుకుల్లాంటి మాటలతో సీతని చిత్రహింస చెయ్యటం నిత్యకృత్యం అయిపోయింది.

భర్తలోని మార్పుకి నిర్ఘాంత పోయింది సీత. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా చాలా క్రుంగిపోయింది.

అంతేకాదు. ఈమధ్య మూర్తికి ఒక అంద

మైన అమ్మాయితో పరిచయం అయ్యిందని, ఆ పరిచయం ప్రేమగా మారి సినిమాలు, షికార్ల దాకాకూడా వచ్చిందని ఆనోట ఈనోట వార్తలు వినిపించసాగాయి సీతకి.

అయినా, భర్తని నిలేసి అడగలేకపో యింది.

చాలా రోజులుగ ఇద్దరిమధ్య మాటలు కరువయ్యాయి.

ఈమధ్య మూర్తి ఇంట్లో ఉన్న కా స్సేపు పగబట్టిన పాములా ఖస్సు ఖస్సు మంటున్నా డు.

ఆఖరికి సీత నోరు తెరిచి కూరగాయలకి రెండు రూపాయలు అడిగినా—

"నీ పుట్టినింటినుంచి ఏమైనా ధనరాసులు గాని మూ టగట్టుకుని తెచ్చావా?" అని ఎత్తి పొడవటం మొదలుపెట్టాడు.

సీత అభిమానపడి సరి అయిన కూర లేకుండా ఉన్నదేదో ఒండిపెడితే "కడుపు నిండా ఒండిపెట్టటం కూడా చాతకాదూ?" అని ఈసడిస్తున్నాడు.

భర్త ఈటెల్లాంటి మాటలతో సీత గుండె గాయపడింది.

అంతేకాదు. ఈమధ్య చీటికిమాటికి సీత మీద చెయ్యి చేసుకోవటంకూడా మొదలుపె ట్టాడు మూర్తి.


సీత మనసూ, అభిమానం, సంతోషం అన్నీ చచ్చిపొయ్యాయి.

ఆ బ్రతుక్కంటే చావు నయం అనిపించిన సందర్భాలు ఎన్నో...

తలచుకుంటేనే దుఃఖం అనిపిస్తోంది. తనేమన్నా అతన్ని పెళ్ళిచేసుకోమని కాళ్ళు పట్టుకుందా? ఏ టీచరు ఉద్యోగమో చూసు కుని తన కాళ్ళమీద తను బ్రతుకుదా మను కుంది. కాని, ఆ రోజు...' సీతని నేను పెళ్ళి చేసుకుంటాను, మాస్టారూ! ఐ లవ్ 'హర్' అని అతను అంటేనే కదా ఈ పెళ్ళి జరిగింది? అక్కడికీ తన తండ్రి ఎంతో దూరవు ఆలోచ నతో, వయసు అనుభవంతో-'మూర్తీ! తొందర పడకు, బాగా ఆలోచించుకో. జాలిపడటానికి ఇది జీవిత సమస్య' అని హెచ్చరించినపుడు కూడా అత నేమన్నాడు? ' సీత మనసు మంచిది. ఆ అమ్మాయి మొహంలో మంచి కళ ఉంది. ఆమెది బ్లాక్ బ్యూటీ. నేను మనసారా ఈ పెళ్ళి అంగీకరిస్తున్నాను' అంటూ అతను పది మంది పెద్దల సమక్షంలోను ఆ మాటలు చెప్తేనే కదా తమ పెళ్ళి జరిగింది!

కాని, ఈ రోజు అతను ఇంత హీనంగా ఎలా మాట్లాడ గలుగుతున్నాడో, ఏదో మోసం చేసి ఈ పెళ్ళి జరిపించినట్లు తప్పంతా తనమీద ఎలా వెయ్యగలుగుతున్నాడో సీత కి అర్థం కావటం లేదు.

అతను ఇంతగా మారిపోతాడని కలగానైనా తా నా నాడు ఊహించి ఉంటే అసలు ఈ పెళ్ళి చేసుకోక పోయేది. ఆజన్మాంతం ఒంట




రిగానే మిగిలిపొయ్యేది.

కాని, నట్టేట నావని ఒదిలినట్లు ఇప్పుడు తనని పొమ్మంటే ఎక్కడికి పోతుంది? అసలు తనకి ఎవరున్నారని?

సీత కడుపులోంచి దుఃఖం తన్నుకుని వచ్చింది. తలగడలో మొహం దాచుకుని ఎంతో సేపు అలా నిశ్శబ్దంగా కన్నీరు ఒలికి స్తూ ఉండిపోయింది.

ఆ తరవాత నెమ్మదిగా లేచి మొహం కడుక్కుని చీరె మార్చుకుంది.

తలుపుకి తాళం వేసి ప్రక్క వీధిలో ఉన్న స్నేహితురాలు సరిత ఇంటికి బయలుదే రింది.

సరిత పూర్తిపేరు సరితా దేవి. ఈమధ్యనే పాపులర్ అవుతున్న రచయిత్రి. తెల్లగా, చక్క గా, అందంగా ఉంటుంది. భర్త డాక్టరు. వాళ్ళది ప్రేమ వివాహం. ప్రక్క వీధిలో రెండంతస్తుల భవనం వాళ్ళ సొంతం. క్రి దంతా క్లినిక్, పైన వాళ్ళు కాపురం ఉంటా రు.

దాదాపు ఆరు నెల్ల క్రితం సీతకి సరితతో పరిచయం అయ్యింది.

అనతికాలంలోనే ఆ పరిచయం విడది య్యరాని స్నేహంగా మారిపోయింది. కారణం సీతకి సరిత రచనలంటే ఎంతో అభిమానం. స్త్రీల కన్నీటి కథలకి, అనాదిగా అణగ ద్రొక్కబడుతున్న స్త్రీ జాతి ఆక్రోశాల కి ఆవిడ రచనలు అద్దం పడుతూ ఉంటా యి. ఎన్నోసార్లు తన హృదయ ఘోషని ఆవిడ రచనల్లో చూసుకో కలిగింది సీత. అందుకే ఆమెతో అనతికాలంలోనే అను బంధం పెంచుకో కలిగింది.

ఆ అభిమానంతోనే సీత కడుపులో బాధ దాచుకోలేక సంసారంలోని అశాంతి అంతా మనసు విప్పి సరితకి చెప్పుకోవటం, ఆమె ఎంతో స్నేహభావంతో ఓదార్చి తోచిన సల హాలు ఇవ్వటం...ఈ మధ్య పరిపాటి అయిపో యింది.

సుఖాన్ని పంచుకుందుకు అక్కర్లేదు గాని, దుఃఖాన్ని పంచుకుందుకు తోడుకావాలి అంటారు పెద్దలు. సీతకి ఆ తోడు సరిత రూపంలో కనిపించింది.

ఎడారిలో ఎండదెబ్బ తిన్న మనిషి చల్లని నీడకోసం తపించినట్లు-భర్త నిరాదరణతో మనసు విరిగి, నా అనుకున్న తోడు లేక క్రుంగిపోతున్న తరుణంలో సరిత స్నేహం సీతకి ఎంతగానో సేదతీర్చింది.

ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్- ఆపదలో ఆదుకోవటా నికి ఒక మంచి స్నేహితుడు అవసరం అంటారు.

సరిత స్నేహాన్ని చవి చూశాక ఆ మాటలో ఎంతో నిజం ఉందో అర్థం అయ్యింది సీత కి. నడుస్తూ ఆలోచన్ల మధ్యే సరిత ఇంటి ముందుకి వచ్చేసింది సీత.

క్లినిక్ ముందు బెంచీలపై పేషంట్లు బారు లు కట్టుకుని కూర్చున్నారు.

సీత వెనకవైపుకి తిరిగి మేటమెట్లు ఎక్కి కాలింగ్ బెల్ నొక్కబోయింది.

కాని, తలుపులు ఓర వాకిలిగా తెరిచే ఉండటంతో చేతిని వెనక్కు తీసుకుంది.

లోపల్నుంచి ఆడవాళ్ళ మాటలు వినిపిస్తు న్నాయి.

అందులో సీత అంటూ తన పేరు కూడా వినిపించటంతో లోపలికి పడుతున్న అడుగు వెనక్కి తీసుకుని గడప దగ్గరే నిల్చుండిపో యింది. "ఏమే, సరితా! నువ్వింత అందంగా, స్టైయిల్‌గా ఉంటావు కదా! ఆ నల్ల జీడి గింజలాంటి సీతతో నీకు స్నేహం ఏమిటో, బాబూ?" బాంకు ఆఫీసర్ భార్య దమయంతి సరితని నిలేసింది.

"అవునే, సరీ! నాకూ అదే అనిపిస్తుంది. మాకు ఆ సీతని చూస్తూనే కడుపులో తిప్పు తుంది కదా! అలాంటిది నువ్వు గంటలు గంటలు ఆ అందగత్తెతో మాటలేవిటి? నీ స్టేటస్ ఏమిటి? నీ పేరు ప్రఖ్యాతులు ఏమిటి? మమ్మీ చెప్పినట్లు దేనికయినా ఒక అంతస్తు ఉండక్కర్లేదూ?" ప్రముఖ వ్యాపార వేత్త భార్య రమణి ఆశ్చర్యంతో బుగ్గలు నొక్కు కుంది.

"అవునండి! ఆవిడ్ని నేనూ ఒక సారి చూశాను. అబ్బా... ఎంత నలుపో, బాబూ, ఆవిడ?! నిజంగా మీకు అంత ఫ్రెండా అండి?" కాలేజీ స్టూడెంటు శ్రీలత ఆశ్చ ర్యంగా గుండె మీద చెయ్యివేసుకుంది. ఆ అమ్మాయి ఆ రోజే మొదటిసారిగా సరితతో పరిచయానికి వచ్చింది.

సరిత చిన్నగా, సమ్మోహనంగా నవ్వింది. పెదవి చప్పరించి చెప్పింది.

"ఆ...ఫ్రెండా, పాడా? నిజానికి ఆ సీతని చూస్తేనే నాకు చిరాకనిపిస్తుంది. కాని, తప్ప నిసరిగా ఆ బోరు భరిస్తున్నాను. భర్త అన్నమా నం తిడతాడట. హీనంగా కొడతాడట. నా

దగ్గర చెప్పుకుని ఏడుస్తుంది. బాగుండదు కదా అని ఏదో ఓదారుస్తాను. పైగా కాస్త బోర్ అన్నమాట గాని, ఆవిడ ఏడుపు నా కథలకి ఎంతో ఇన్‌స్పిరేషన్. నిజంగా భర్తలు భార్యల్ని అంత హీనంగా చూస్తారన్న సంగతి నాకు తెలియదు. మాది లవ్ మరేజ్ కదా?" సరిత చిన్నగా, గర్వంగా నవ్వింది. నాజూగ్గా ముంగురులు సవరించుకుంది.

"అమ్మయ్య బతికించావ్. నేనూ అదే అనుకుంటాను. ఆ నల్ల కోతితో నీకు ఫ్రెండ్‌షిప్ ఏమిటా అని! పాపం ఆ విష్ణుమూర్తి ఎంత లవ్లీగా ఉంటాడో!" దమయంతి ప్రశంస.

"ఎలా చేసుకున్నాడంటావ్ ఈ అందగత్తెని?" రమణి ఉవాచ.

"ఆ... ఏముంది? ఏ మందో మాకో పెట్టి మెళ్ళో తాళి కట్టించుకు ఉంటుంది." దమయంతి జోక్ పేలింది.

ఆడాళ్ళంతా ఒకేసారి గొల్లుమన్నారు.

గడపలో నిల్చున్న సీత స్తంభీభూతురాలు అయ్యింది.

వాళ్ళ మాటలు, నవ్వులు గుండె మీద గునపాల్లాగ గ్రుచ్చుకున్నాయి.

కాళ్ళ కింద భూమి జారిపోతున్నట్టు, కళ్ళ ముందంతా నల్లని చీకటి తెరలు పరుచుకుంటు న్నట్లయి తూలి పడబోయింది.

అతి కష్టంతో గోడ ఆసరా చేసుకుని రెండు నిమిషాల సేపు తనని తాను నిగ్రహించుకుంది.

శరీరంలోంచి రక్తం అంతా తోడేస్తున్నట్లు ఒక విధమైన బాధ.

తాను పూల దండ అనుకుని మెడలో ధరిస్తే, పామై కాటు వేసినట్లు చేదు అనుభవం.

అతి కష్టంతో రోడ్డు మీదికి వచ్చి రిక్షా మాట్లాడుకుని కూర్చుంది.

రిక్షా వేగం అందుకుంది.

×× ×× ××

సాయంత్రం ఏడుగంటల ప్రాంతంలో ఆఫీసునుంచి చిటపటలాడుతూ ఇంటికి వచ్చిన మూర్తికి తలుపుకి తాళం కనిపించి విస్తుబొయ్యాడు.

జేబులోంచి డూప్లికేట్ తీసి తాళం తెరిచి లోపలికి వచ్చాడు. 'ఇంతరాత్రి ఇది ఎక్కడికి వెళ్ళింది చెప్మా!' కొద్దిగా ఆశ్చర్యపడుతూ లైటువేసిన మూర్తికి ఎదురుగా టేబిల్ మీద పేపరు వెయిట్ కింద రెపరెప లాడుతూ ఉత్తరం మడత కనిపించింది.

విస్మయంగా దాన్ని అందుకుని మడత విప్పాడు.

"మీకు...

నేను వెళ్ళిపోతున్నాను. నా కాళ్ళమీద నేను నిలబడ గలిగితే బ్రతుకుతాను. లేకపోతే చచ్చిపోతాను. అంతేగాని, తిరిగి మీ ఇంటికి మాత్రం రాను. మీకు నచ్చిన అమ్మాయిని చేసుకుని ఇకపై ఆనందంగా జీవించండి. మనసుతో మనసుని చూస్తే కనిపించేది ఆత్మ సౌందర్యం. కళ్ళతో కళ్ళని చూస్తే కనిపించేది బాహ్య సౌందర్యం. మనసుకి కళ్ళుంటే నా అందం కనిపిస్తుంది. కాని, మీ మనసు గుడ్డిది. అందానికి అందం ఆత్మ సౌందర్యంకదా మరి.

మొదట్నుంచి మీరంటే నాకు ఎంతో ప్రేమ, అనురాగం. మన పెళ్ళి జరిగాక, వాటికి కృతజ్ఞత కూడా తోడయ్యింది. మీరు నా మూగ ఆరాధనని అర్థం చేసుకున్నారు కదా అని మురిసిపొయ్యాను.

మీకు అందమైన రూపంతోపాటు అందమైన మనసు కూడా ఉంది కదా అని ఆనందపడ్డాను. కాని, మీరు ఏదో అర్థంలేని ఆవేశంతో నన్ను గుడ్డిగా పెళ్ళి చేసుకున్నారు.

అందుకే గుడ్డివాడి చేతికి రాయి ఇస్తే ఏమవుతుందో చివరికి నా జీవితం అంతే అయ్యింది. శాశ్వతంగా మీ ఇంటినుంచి వెళ్ళిపోతున్నాను.

సీత."

ఉత్తరాన్ని చదువుకున్న మూర్తి ఎంతో సేపు అలాగే శిలా విగ్రహంలా ఉండిపొయ్యాడు.

అతని అంతరాంతరాలలో అంతు చిక్కని సన్నని వేదన! ★

